ప్రజాసేవకుడు కాళాస్త్రి



ఈ కథకాని కథలోని కథానాయకుని పరిచయం చేసే బాధ్యతను అత్యంత జాగ్రత్తగా నిర్వర్తించ వలసిన కారణంగా ప్రత్యక్షరంలోనూ ప్రస్ఫుటించే భావాలకూ సమాజంలోని పోకడలకూ పోలికలు తప్పనిసరి కావలసి రావడం కర్మ గాదు ఖర్మ అనుకోవడం ఎంతో మంచిది.

ఇంతకూ ఆయన పేరు కాళాస్త్రి. కాళ+హస్తి కాళాస్త్రియై చివరికి కాళాస్త్రిగా రూపొందినది. ఈ పేరు ఇట్లా ప్రజలు ఇస్త్రీచేసి వేయడం కాళాస్త్రి దురదృష్టం. ఇది ప్రజారాజ్యం కనుక ప్రజల భావాలకూ ఆలోచనలకూ చేతలకూ అనుకూలంగా కాళాస్త్రి నడుచుకోవాలని తను సంతకం చేసేటప్పుడు సహితం కాళహస్తికి మారు కాళాస్త్రి అనే సంతకం చేస్తుంటాడు. ఆయన ప్రజాసేవా కార్యక్రమానికిదే నాంది వాచకం.

కాళాస్త్రి అచ్చంగా తెలుగు చిత్రాలలో బ్రహ్మదేవుని వలె ఉంటాడు. భేదమంతా తలల సంఖ్యలోనే కానీ వాస్తవానికి కళాస్త్రికి మనిషి కుండవలసినంత కంటే నాలుగు రెట్లెక్కువ అఖండమైన తెలివి తేటలు ఉన్నాయి. అందుకే ఆయన అచిర కాలంలో ప్రఖ్యాతి వహించిన ప్రజాసేవకుడై అమోఘంగా రాణించ గలిగాడు.

కాళాస్త్రి పూర్వగాథ యెవ్వరికీ తెలియదు. తెలియజెయ్యాలనే ప్రయత్నంలో కాళాస్త్రి విఫల మనోరథుడై పోయాడు. ఆయన ఉద్దేశ్యం ప్రకారం 'ప్రజాసేవకుడు కాళాస్త్రి' అనే పతాక శీర్షికతో ఏ స్థానిక పత్రికలో నైనా కనీసం పది వారాలపాటు ఒక చిన్న తుఫానువలె వ్యాసపరంపర వెలువడాలని. లేదా ఒక జన్మ దినోత్సవ కమిటీ వ్యవస్థీకరించబడి అధమం ఐదు వందల పేజీలతో నైనా అంద చందమైన అచ్చుతప్పులులేని మేటరులో ఒక సుందరమైన సావనీరు వెలువడాలని.

ప్రజలలో ఆ పాటి విచక్షణా శక్తి లేనందున కాళాస్త్రి కోరిక కోరికగానే నిలిచిపోయింది. ఐనా ఏ పత్రికా విలేఖరియో స్థానిక పత్రిక ఉప సంపాదకుడో కన్పించినపుడు బలవంతంగా ఆయన్ని కాఫీ హోటలుకు తీసుకెళ్లి ఒన్‌బైటు అని సర్వరుకు ఆర్డరిచ్చి తన జీవిత గాథను ఆరంభిస్తాడు.

"ఆ రోజుల్లో మీరు బహుశా పుట్టి ఉండరనుకొంటాను. బొంబాయి మెయిల్ని అమాంతం ఆపేశాము. డి. యస్. పి. బంగళాలో ఐదు నాటు బాంబులు పడేశాము. సెంట్రల్ జైల్లో మాతో గంజితాగిన వాళ్లేగతి పట్టారో తెలుసా...."

ఇట్లాసాగే ఉపన్యాసం నుండి ఆ యెదుటివాడు ఎంతో ఓపికగా తప్పుకోవడం అసాధ్యం కాగా ఇంతలో ఎవరో తారస పడుతారు.

ఆ వచ్చినవాడమాంతం కాళాస్త్రిని కౌగలించుకొంటాడు.

దేశానికంతా రైతు కామధేనువు వంటివాడైతే, రైతుకు కాళాస్త్రి కల్పవృక్ష మవుతాడు.

చింతకాయలపెంట— ఎలగమాను మిట్ట— ఎలుంగొడ్ల పల్లె, పూరేళ్లగుట్ట— చిలకల పాలెం జెర్రి పోతులోళ్లూరు, తాటిమాన్లపెంట— కొట్టే వాళ్ల కండిగె పరిసరాల గ్రామాలు సుమారు అరవైదాకా కళాస్త్రి కనుసన్నల్లో మెలిగే జనపదాలు.

కాళాస్త్రి నివాసం చిలకల పాళెం. ప్రస్తుత దేశకాల పరిస్థితుల ప్రభావాను గుణ్యంగా కారణమేదో చెప్పడం కర్తవ్యమైనా చెప్పక తప్పుకోవడమే ధన్యత్వం కనుక ఎలా సంపాదించారో కానీ ఆయనకక్కడ పదెకరాల పొలం ఉంది.

ఆరు వందల ఆవులు మేసే ఆ అడవి పురంబోకును కాళాస్త్రి పట్టా చేసుకొన్నాడు. అంటే ఆ సుక్షేత్రానికి రాజాధిరాజుగా పట్టాభిషిక్తుడైనాడు.

ఎరువుల సారాన్ని నిలవచేసే పథకం క్రింద

ఏడు వందలు—, రొఖ్ఖం—	700—00
నేలను చదునుచేసే స్కీముక్రింద వెయ్యి	1000—00
మామిడి మొక్కలు ఇత్యాది ఫల వృక్షముల పెంపకమనే పథకంతో	2000—00
బావి సబ్సిడీ—	750—00
మరో బావికి ఋణం	1750—00
ఇంజనులోను	2000—00
విత్తనాలకు అప్పు	1250—00
రసాయనికపు ఎరువులకుగాను అప్పు	550—00
ఎద్దులు పట్టుటకు అప్పు క్రింద	960—00
పండిన ధాన్యంమీద అప్పు	1000—00
కో ఆపరేటివ్ సొసైటిలో షేరు కట్టి భూమినిచూపి	3000—00
వెరసి మొత్తము.	14960—00

అక్షరాలా పదునాలుగువేలా తొమ్మిది వందలా అరవై రూపాయలు ప్రభుత్వం నుండి సంపాదించాడు కాళాస్త్రి. ఆరేండ్ల వ్యవధిలో ఇంత గొప్ప సుక్షేత్రాధిపతియై అంతకంటే పదిరెట్ల ఆదాయాన్ని సంపాదించిన వాడీ ప్రపంచంలో ఉండడనీ ఉండడానికి వీలుకాదనీ అది సంభవమనీ ఆ ప్రాంతీయ ప్రజానీకం వేనోళ్లతో చాటుతూ ఉంటారు.

కాళాస్త్రి ఎంత ఘటికుడో ఎవ్వరికీ తెలియదు. తెలియని రహస్యాలు ఆయన జీవితంలో అసంఖ్యాకాలు.

ఆ మధ్య యేదో ఉప్పుడు బియ్యం, కాదు దంపుడు బియ్యం పరిశ్రమ క్రింద అమాంతం ఒక్క సారిగా ఐదువేలు వచ్చిందంటారు.

ఇట్లా భూమిని దున్నకనే—, ఎరువులు వెయ్యకనే—, బావులు త్రవ్వకనే—, చెట్లు పెట్టకనే, ఎడ్లు పట్టకనే మొలకలు పుట్టకనే వచ్చిబియ్యం,

కాదు కాదు దంపుడు బియ్యం దంచేకనే ఇరవై వేల నార్జించిన ఈ విశ్వవిఖ్యాతి పురుషుడు చిలకల పాళెంలో తలలో నాలుకవంటివాడు.

ఆ ఊళ్ళో ఆయన సహాయం పొందని వారు అరుదు.

అల్లం చిన రామయ్య కూతురు పెండ్లి కుదిరింది. ఆ పిల్లకు కన్ను మెల్ల. తెల్లగడ్డ చింపిరయ్య కొడుకు జానకయ్య రత్నంలాంటి కుర్రాడైనా ఐదువేలు కట్నం ఇవ్వందే పెళ్ళాడనన్నాడు. ఆ సందర్భంలో కాశాస్త్రి కాలికి బలపం కట్టుకొని, చెరువులో చేపలుపెంచే స్కీము క్రింద—, చేల్లో కోళ్ళు పెంచే పథకం క్రింద—, ఆలమీద కోడెను పెంచే అమాంబాపతు పద్దు క్రింద ఆరువేలు సంపాదించి అందులో ఒక్క రెండువేలు మాత్ర తాను పుచ్చుకొన్నాడు. అతని త్యాగాన్ని గురించి అల్లం చినరామయ్య అడివి పల్లెలంతా చాటించాడంటే ఎందుకు చాటించడు ?

కాశాస్త్రి ఎప్పుడూ ఎల్లవేళలా మల్లెపువ్వుల్లాంటి పంచలే కడతాడు. చందనం రంగు జుబ్బాలన్నా—, సరిగ వచ్చిన అంగ వస్త్రాలన్నా అతని కమితమైన ప్రీతి.

చిలకల పాళానికి బుంగల గుంటకు పదిమైళ్ళు. బుంగల గుంట తాలూకా కేంద్రం. అక్కడ డిప్యూటీ కలెక్టరుగారి కార్యాలయం కూడా ఉంది. ఆ కార్యాలయాని కెదురుగా ఒక పార్కు. ఆ పార్కులో ఒక సిమెంటు తిన్నె.

కాశాస్త్రిని పట్నం చూడాలంటే ఆ తిన్నె మీదనే చూడవచ్చు. అక్కడాయన అసంఖ్యాకమైన అర్జీలనూ—, పిటీషన్లనూ సృష్టిస్తూ ఉంటాడు. ఎప్పుడూ ఆయన చుట్టూ పది మంది తప్పకుండా ఉంటారు. చిలకలపాళెం పరిసరాల ప్రజానీకంలో ఎవరికేది కావలసి వచ్చినా ఆయనే దిక్కు.

ఆయన ఆపద్బాంధవుడు. ఎంతటి చిక్కునైనా చిటికెలో తీర్చి వేయగల మహామహుడు.

కొట్టువాళ్ళ కండిగలో కంపల వెంగయ్య ఒక సందర్భంలో పెద్ద ప్రమాదంలో పడిపోయాడు. ఆయన ఇంటిని ఆకస్మికంగా రివెన్యూ ఇన్స్పెక్టరు గారు సోదా చేశారు. ఎద్దులకని లోను తీశాడు గానీ ఆ డబ్బుతో ఆయన సారా వ్యాపారం ఆరంభించాడు. ఇది ట్లాగో పసిగట్టిన రివెన్యూ ఇన్స్పెక్టరు కంపల వెంగయ్యను గట్టిగా పట్టుకొన్నారు.

అతడెట్లాగో తప్పించుకొని పెరటి దారిన బుంగల గుంటకు పలాయనుడై పార్కులో సిమెంటు తిన్నెపై ఆసీనుడై ఉన్న కాశాస్త్రి పాదాలపై వ్రాలి అలనాటి గయునివలె శరణాగతుడైనాడు.

ఒకే ఒక గంట కాలంలో టాక్సీలో వెళ్ళి కాశాస్త్రి ఆ సమస్యను పరిష్కరించేసి పారేశాడు.

"ఏముంది అందులో ఈ మాత్రానికే ఇట్లా బెదురుతావేం" అన్నాడు కాశాస్త్రి అంతా ముగిశాక.

వెల్లుల్లిపాళెం చిక్కాలయ్య ఎద్దులు బలే మంచివి. చేతులెత్తున్నాయి. బొల్లికొండ పరసలో ఎనమన్నూట యాభై ఇదిచ్చి ఆ వారం రోజుల క్రితమే పట్టుకొచ్చాడతడు. ఆ ఎద్దుల్ని కాశాస్త్రి పట్టుకొచ్చి కంపల వెంగయ్య పశులపుకొట్టంలోని గాట్లో కట్టేసి చావిడి కాడ కూచున్న రివెన్యూ ఇన్స్పెక్టర్ని బలవంతాన పిలుచుకువచ్చి చూపించడమే గాదు రిపోర్టు కూడా రాయించేశాడు.

ఇట్లా పీకల మీదికి వచ్చిన కొండంత ప్రమాదాలను గోటితో చిమ్మివేసే బ్రహ్మాండమైన ప్రజ్ఞా పాటవములున్న కాశాస్త్రి ఒకనాడు ఏదో పనిమీద ఆస్పత్రికి వెళ్ళాడు.

బుంగల గుంటలో ఆస్పత్రిని భూలోక నరకమంటారు. అందులో ఉన్న వాళ్ళందరూ యమదూతలని సాక్షాత్తు డాక్టరుగారు యమధర్మరాజని— అక్కడి జనాల నమ్మకం. అందుకే అందులోకి ఎవ్వరూ వెళ్ళక ఆ యాస్పత్రి చుట్టూ బోర్డులు కట్టుకొన్న వందలాది నేటివ్ డాక్టర్లవద్ద వేలాది ఇంజక్షన్లు తీసుకొని లక్షలాది రూపాయలను ఖర్చుపెడుతూ, కోట్లాది పన్నులు కడుతున్నా ఈ గవర్నమెంటు మా మొరాలకించదేం అంటూ అఘోరిస్తుంటారు.

కాశాస్త్రిని డాక్టరుగారు చూచిందే మందు కావాలేమోనని

"మీ పేరేమి" అన్నాడు.

"కాశాస్త్రి" అని సమాధానం చెప్పాడు కాశాస్త్రి

"నే నడిగింది నీపేరయ్యా"

"కాశాస్త్రి"

"వూరు పేరు కాదు. నీ పేరు చెప్పవయ్యా అంటే...."

కాశాస్త్రికి కోపం వచ్చింది. అతనికి కోపం వస్తే ఏమీ మాట్లాడడు. ఆ క్షణంలోనే అతని భరతం పట్టించడ మెట్లా అని ఆలోచిస్తాడు.

అంతే.. గిరుక్కుమని వెనక్కి తిరిగి మినప రామయ్యసెట్టి కొట్లో ఒక్కటిన్నర రీము కాగితం కొన్నాడు. జమాజమా ప్రెస్సులో ఇచ్చి ఒకే రకం పిటీషన్లు నాలుగువేలు అచ్చేసి ఒక్కొక్క పిటీషన్లో వంద సంతకాలు (వ్రేలి ముద్రలతో సహా) చేయించి ఆ కట్టల్ని ఒకే బంగీగా కట్టించి సరాసరి రాజధానిలోని గౌరవనీయుల పేర పారెసల్ చెయ్యించాడు.

ఇంతవనీ జరగడానికి మూడు రోజులే పట్టిపోయినా ఆ డాక్టరుగారికి ట్రాన్స్ఫర్ మాత్రము మూడు మాసాలకు వచ్చింది.

ఈ దెబ్బతో కాశాస్త్రి ఖ్యాతి కస్తూరి సువాసన వలె బుంగల గుంట తాలూకా సరిహద్దులను దాటుకొన్నది.

అనుదినమూ, అనుక్షణమూ ఉత్పన్నమయ్యే ప్రజల సమస్యలను పరిష్కరించాలంటే తనకొక చిన్న జీపు కారుండాలని తోచింది కాశాస్త్రికి.

"ఈ బీడీవోలు, జీడీవోలు డీఇవోలు, యస్ ఈ వోలు, ఆ ర్ డీ వో లు, ఆ ర్ టీ వో లు, ఇట్లా జీపులలో పల్లెమీదికి దాడిచేయకుంటే నాబోటి వాడికో జీపెందుకియ్యదీ ప్రభుత్వం" అని చాలా మందితో అన్నాడు కాశాస్త్రి. కాశాస్త్రికి జీపు కావలసిన మాట నిజమే. దాన్ని సంపాదించడం యెట్లా ?

అప్పుడప్పుడే జనరల్ ఎన్నికలు వస్తున్నవి. కాశాస్త్రికి తళుక్కున మెరుపులాంటి ఆలోచన తట్టింది. "బలే మంచి సమయము మించినన్ దొరకదు." అవును. దొరుకుతుందా మరి అలాంటి సమయం. కేవలం ఓటున్న మూగవాడే మూడు రూపాయలనుండి ముప్పై రూపాయ లార్జించే ఆ తరుణంలో కాశాస్త్రి వంటి అఖండ మేధాసంపన్నుడు ఐదువేలైనా ఆర్జించలేడా ?

ఐనా పెట్టుబడి కావాలి. పెట్టుబడి లేనిదే ఏ వ్యాపారమూ సాగదు. కనుకనే కాశాస్త్రి పెట్టుబడి దారులను గట్టిగా విమర్శిస్తుంటాడు. కార్మికులకోసం కడవలాదిగా కన్నీరు కారుస్తుంటాడు.

రెండు వందలా యాభై చెల్లించి నామినేషన్ వేశాడు.

జమాజమా ప్రెస్సులో కూచొని మహోద్భుతమైన ఒక కరపత్రాన్ని నాలుగువేలా నాలుగువందల నలభై నాలుగు పదాలతో రచించాడు.

—81 వ పేజీ చూడండి

...ఊరు పేరుకాదు...
...నీపేరు చెప్పవయ్యా?



అవ ఫోటో బ్లాకు ఎంతో వినయంగా ప్రజల ముందు వినమ్రుడై నమస్కృతులు సమర్పిస్తున్నట్టుగా మొదటి పేజీ—,

ఆ వెనుక తానెవరు ? తన జీవితాశయం నేటి పరిస్థితులు—, ప్రభుత్వం దుబారా ఖర్చులు పార్టీల అనిశ్చిత పరిస్థితులు— తాను గెలువబోయే విధానము— ప్రజల సంసిద్ధత— గెలువగనే తాను తలపెట్టనున్న మూట వలబై నాలుగు పథకాలలోని ప్రధాన సారాంశము.

ఈ కరపత్రాలు విడుదల కాగానే గుమ్మడి కాయల సూరయ్యకు ముచ్చెమటలు పోశాయి. పూర్తిగా చదవగానే ఆయన సొమ్మసిల్లి పడిపోయాడు.

ఈ విపత్కర పరిస్థితిని దాటి పోటీ నుండి కాశాస్త్రిని విరమింప చెయ్యడానికి సూరయ్య విశ్వ ప్రయత్నాలు చెయ్యగా చెయ్యగా నామినేషన్లు ఉపసంహరించుకోవడానికి గడువు సరిగ్గా ఏడు నిమిషాలు ఉండవగా ఫలించినది.

ఎన్నికల ప్రచారానికి సూరయ్య కొన్న కొత్త జీపు కాశాస్త్రి స్వాధీనం చేయుబడినది. ఆ జీపులో సూరయ్య కోసం ప్రచారం చేస్తున్నట్లు కాశాస్త్రి నటిస్తూ సూరయ్యకు పోటీగా ఉన్న పెసరట్ల ఆనందయ్య వద్ద రెండువేలు తీసుకొని అతనికే సాయం చేశాడంటారు. నిజానిజాలు దేవుడికి తెలియాలి గాని ఆ ఎన్నికల్లో సూరయ్యా గెలవలేదు ఆనందయ్యా గెలవలేదు. గెలిచినాయన ఇంకో ఘటికుడు. ఆయన పేరు ఈ క్షణాన గుర్తుకు రాకపోవడం కాశాస్త్రి విస్తృతమైన ప్రభావమే కారణమని అంగీకరించక తప్పడంలేదు.

ఏదేమైతేనేం కాశాస్త్రి జీపును సంపాదించాడు. అది రోడ్డు వెంబడి దుమ్మును రేపుతూ పోతుంటే బాటసారులు "అతడే అతడే కాశాస్త్రి. పోయిన దఫా చాలుకొన్నాడు కాని ఈ మారు నిలిస్తే అతడికి ఓట్లతోపాటు వోట్లు కూడా వేస్తారు" అని అంటూ ఉంటారు.

కాశాస్త్రి బాగా స్థిరపడిపోయిన ప్రజా సేవకుడు. నాయకుడనడం అతనికి ఇష్టంలేదు. సేవకుడంటేనే అతడికి చాలా ఇష్టం.

ఉన్నట్టుండి కాశాస్త్రికి మరో సిరి పట్టుకొన్నది. సిరి ఆయన్ని పట్టుకొన్నదో లేక ఆయనే సిరిని వెదకి కనుగొని పట్టుకొన్నాడో చెప్పడం కష్టం. అక్కడి జనాలంతా ఆయన త్యాగాన్ని ఆదిశేషునికే మాత్రం తీసిపోని విధంగా అభివర్ణిస్తారు.

చిలకలపాలెం నుండి బంగలగుంటకు పది మైళ్లగదా. ఈ బాట కిరువైపులా ఉండే మద్ది, నేరేడు, చింత, వేప, కానుగ, తాటి, రాగి, మర్రి ఇత్యాది వృక్షములన్నీ రాత్రికి రాత్రే అదృశ్యమైపోయాయి. ఒక్క రాత్రిలో కాక పోయినా ఒక్క అర్ధ సంవత్సరంలోగా ఈ పథకం పూర్తియైపోయినది. ఆ రోడ్లో వెడుతుంటే వన కాంతలవలె పచ్చగా ఆశీర్వదిస్తుండిన వృక్షాలు తలలు బోడులై, మోడులై, ముక్కలై, చివరికి క్రమక్రమంగా కూకటి వేళ్లతో సహా అదృశ్యమైపోయినవి.

ఈ పథకం పూర్తి కాగానే కాశాస్త్రి బంగల

ప్రజాసేవకుడు

11-వ పేజీ తరువాయి

గుంట స్థానికాధికారులను, ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోస్తూ స్థానిక పత్రికలలో నిరంతరంగా ప్రకటనలిస్తూ వచ్చారు. అన్నిటినీ సఫా చేయించి అందులో మంచి ఆదాయాన్ని సంపాదించి చివరికా అన్యాయాన్ని చేసిన వారిని దండించాలంటూ కాశాస్త్రి సల్పిన ఆందోళన ఫలితంగా అక్కడి అధికారులు బుంగలగుంట చిలకలపాలెం రోడ్డులో ఆరు బోర్డులు వేశారు.

"రోడ్డుమీద చెట్లు నరుకువారు శిక్షింపబడుదురు."

ఈ చర్యతో రోడ్డులో కొమ్మ పడినా తక్షణం ప్రక్కకు ఈడ్చి ప్రజలక్కడ ఆ కొమ్మలను ముక్కలు చేయడం ఆరంభించారు.

కాశాస్త్రి సంపాదనలో బాగా మిగిలిపోయినా అనుక్షణం ఏదో ఒక మహత్తరమైన బృహత్ప్రణాళికను గురించి ఆలోచిస్తూ ఉంటాడు.

ఇప్పుడాయన బుంగలగుంటలో ఒక బుల్లి మేడను కూడా కొన్నాడు. పార్కులో కూచునే దౌర్భాగ్యం లేదాయనకు.

చిన్నగా సన్నగా నవ్వుతూ ఏదో దీర్ఘంగా ఆలోచించే ఆయన ప్రసన్న వదనాన్ని చూచి గొప్ప గొప్ప న్యాయవాదులే ముగ్ధులై పోతూ ఉంటారు. అంతో ఇంతో పలుకుబడి కల రాజకీయ నాయకులు మనస్సులో ఇష్టం లేకున్నా అత్యంత మర్యాదగా అతనికి నమస్కారాలర్పిస్తూ ఉంటారు.

అత డే ఆఫీసుకు వెళ్లినా క్షణాల మీద అతని పని పూర్తయిపోతూ ఉంటుంది. ఇప్పుడసలు వెళ్ళే అవసరం కూడా లేదు. ఇటీవలె ఫోను కూడా పెట్టుకొన్నట్లు బుంగల గుంట టెలిఫోన్ గైడు సాక్ష్యమిస్తున్నది.

అన్నిటికంటే ఆశ్చర్యమేమంటే ఉన్నట్టుండి చక్కెర కరువువచ్చి బుంగలగుంటేకాదు దేశమంతా అఘోరిస్తుంటే, చేతకాకుండా అల్లల్లాడుతుంటే, కాశాస్త్రి క్షణాలమీద వందా యాభై కిలోలు తెప్పించాడు. "ఇంత చక్కెరే.... బ్లాక్ మార్కెట్లోనా" అంటూ తన కళ్లను తానే నమ్మలేకుండా కళ్లనులుము కుంటున్న కంపెని చెంగయ్యతో

"బ్లాక్ మార్కెట్లా. న్యాయంగానే.. ఇదో చూడు పెండ్లి పత్రికలు" అంటూ మూడు పత్రికలు ముందుంచాడు.

ఒకటి....

స్వస్తిశ్రీ శోభకృతునామ సంవత్సరం..... సింహ లగ్నమున....

నా కుమారుడు కల్లాపేట ఎల్లయ్య

సకలపాణికి చెంగమ్మకు కుమార్తె

మంగల చెరువు ఎల్లమ్మ గుడిలో పెండ్లి గాన అందరూ విచ్చేయ ప్రార్థన.

ఇట్లు,

కుళ్లం ఎర్రయ్య.

ఇట్లా ముగ్గురి పేర్లతో మూడు పెండ్లి పత్రికలు, అన్నీ జమాజమా ప్రెస్సులో అచ్చయినవే.

బుంగల గుంట తాశిల్దారుగారు కాశాస్త్రి పంపిన ముగ్గురు మనుష్యులుకూ తలో యాభై

విశేషంగా మాట్లాడినంతలో యోచనాపరుడగునని పరిగణించ తగదు!

ఎదురు తెన్నులు

బి. యస్. యల్. పి. దేవి

సందె చీకటిలోన చందమామాతోడ
యమునా నదికి నన్ను రమ్మంటివే, కృష్ణ
బాస జేసీ నీవు రావైతివే!!

ఎదురు తెన్నులు జూచి కనులు కాయలుగాచె
ఎదలోని వ్యథ పొంగి పొరలేనురా, కృష్ణ
ఏల నీకీ జాగు యదునందనా!!

మలయ పవనం బొకడు మరుని మా మింకొకడు
మదనాగ్ని కీలలం బడవైచెరా, నీదు
యలుసు గని నను వారు గారించెరా!!

ఏ గోప భామతో యేకాంతముంటివో
ఎటుల నే నిలు సేరగల్గుదురా, ఇంత
తడవేల ననగనే నేమందురా!!

పెద్దలుండినదాన పిన్నవయసూ దాన
నలుగురిలో నగుబాటు సేయకయ్యా, నీకు
పున్నమాయెను గాని పురుషోత్తమా!!

సంజకెంజాయలో చంక బిందెను బెట్టి
చక్కంగ నీటికని వచ్చేనురా, ఇంక
జాగు సేయక నన్ను మన్నించరా!!

గజదొంగవలె వచ్చి కనులు మూసే నిన్ను
కలనైన నే నెటుల మరచేనురా, కొంటె
గోపాల నీ మాట లేమందురా!!

జాగు చేసితి వంచు చెలులందరూ నన్ను
జేరి హేళన యెంతో చేసేరురా, ఇంక
ఇకనైన నొకమారు కనుపించరా!!

అదియేమొ నా ప్రభూ నీ అందచందాల
ఆలోకనము దివిని జేరేనురా, కృష్ణ
అమర సుఖముల నేను బొందేనురా!!

ఏనాటి ప్రేమల అనుబంధమో గాని
ఎద నిన్నె అనుక్షణము గోరేనురా, యిందు
కీలకంబేమొ నా హృదయ చోరా!! ★

ప్రజా సేవకుడు

కిలోలు శాంక్షన్ చేశారు. అది ఆయన ధర్మం. ఈ దేశానికి పట్టిన కర్మం. కాశాస్త్రి హృదయంలో ఉన్న మర్మం.

"నాకో నాల్గు కిలోలు" అన్నాడు లొట్టలు వేస్తూ కంపల చెంగయ్య.

"ఊళ్లో బ్లాక్ మార్కెట్లో కిలో మూడు రూపాయలు. నీకు రెండుంపావలా" అన్నాడు కాశాస్త్రి.

ఎంత మంచివాడు కాశాస్త్రి అనుకొన్నాడు కంపల చెంగయ్య.

నిజానికి కిలో రూపాయిపావలా ఐనా కార్డుగానీ పర్మిటుగానీ వీటికి తగ్గ సిఫార్సుగానీ ఉండి తీరాలి. అది లేనపుడు బ్లాకులో కిలోకు మూడు రూపాయలు తగల బెట్టాలి.

అలాంటపుడు కాశాస్త్రి కిలో రెండుంబావలాకిప్పిస్తుండేటే ఎంత త్యాగం ! ఎంత త్యాగం ! ఎవరితరము ! వర్ణించ నలవియా ? వేయి శిరస్సుల శేషునికైనా !

సరిగ్గా ఇలాంటి పదాలతోనే కొన్ని రోజుల క్రిందట కాశాస్త్రి కూతురి పెళ్లిలో పంచ రత్నాలు చదివాడొక అభ్యుదయ రచయిత.

కవి వాక్కు వృధా కాదంటారు. ఎందుకంటే ఎలుంగొడపల్లె సిగరమాన్న సుందరయ్యతో సంబంధం కుదుర్చుకోవడం సామాన్యమైన విషయంకాదు. సిగరమాన్న సుందరయ్యకు మూడు బస్సు రూట్లున్నాయి. ప్రతి నిత్యమూ ప్రతి ట్రిప్పుకూ ప్రతి బస్సులో వందా ఇరవైమూడు మందికి తక్కువ లేకుండా ప్రయాణం చేస్తుంటారు. ఈ మూడు పుష్పక విమానాలతో ఎలుంగొడ్లపల్లె సిగరమాన్న సుందరయ్య ఎంతటివాడైనాడంటే ఆ ప్రాంతంలోని అడివి పల్లెం పంచాయితీ బోర్డు ప్రెసిడెంట్లలో ముప్పాతిక మందిని కొని సమితి ఎన్నికల్లో సరాసరి కుంభకోణానికి రవాణా చేసిపారేశాడు. సరిగ్గా కో ఆప్షన్ సభ్యుల ఎన్నికనాడు మూడు గంటలా ఐదు నిమిషాలా ఇరవై ఐదు సెకెండ్లకు టూరిస్టు బస్సు ఇరవై ఆరుమంది పంచాయతీ బోర్డు అధ్యక్షులతో డిప్టీ కలెక్టర్ ఆఫీసు ముంగిట సోపానాలను స్పృశిస్తూ నిలిచింది.

ఆ దెబ్బతో సిగరమాన్న సుందరయ్య మనుషులు మరో ఆరుమంది సభ్యులై ఎదుటివాడికి చావుదెబ్బ తగిలి తానే ఏకగ్రీవంగా ఎన్నికైనాడు.

బుంగల గుంట తాలూకా కేంద్రమైనా ఎలుంగొడ్ల పల్లెలోనే సమితి స్థిరి యేర్పడి అక్కడ సుందరయ్య రాజ్యం ఎంతో అందంగా సాగుతున్నది అప్సరసల నృత్యాలతో.

అతని కుమార రత్నం అరవ సినిమాల్లో నాయ

కుదులాలాగా గర్జిస్తాడు. జాలీ జాలీ చేసుకొనే పీడా విక్కీకి రత్నమంటే భయం. అతనికే కాశాస్త్రి కుమార్తెను ఇవ్వడానికి నిశ్చయించు కొన్నారు. కట్నం కానుకా లేకుండా జరిగిన ఈ వివాహానికి బ్రహ్మాండమైన పొలిటికల్ బ్యాగ్రౌండ్ ఉందని వచ్చే ఎన్నికల్లో కాశాస్త్రి సుందరయ్యా ఏకమై సుందరయ్య కొడుకు రత్నాన్ని యం. యల్. ఏగా చేసి పారేస్తారని—, ప్రస్తుతం దేశంలో ఇలాంటి ఆలోచనలూ—, కార్యాచరణాలూ అసంఖ్యాకంగా జరుగుతున్నందున ఇందులో ఆశ్చర్య పడవలసిన విశేష మేమీ లేదని బుంగల గుంట స్థానిక పత్రిక టాంటాం ఒక పతాక శీర్షికను ప్రచురించినది.

ఆ పెండ్లికి హాజరైన అనేకమంది పెద్దల పేర్లను వరుసగా ప్రకటిస్తూ బుంగల గుంట తాలూకా మొత్తం ఆర్థికంగానూ, సాంఘికంగానూ రాజకీయంగానూ, విద్యా విషయకంగానూ కాశాస్త్రి గుప్పిట్లోకి వచ్చేసిందని ఆ విలేఖరి స్పష్టంగా ఉద్ఘాటించాడు.

అందుకు తగ్గట్టుగానే కాశాస్త్రి ఓం ప్రథమంగా ఎలిమెంటరీ స్కూళ్ల టీచర్లపై ట్రాన్స్ఫర్లనే వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. ఈ క్రొత్త వ్యాపారంలో ఆయనకు అనుకొన్నంత మొత్తం అందకపోగా ఈ బడిపంతుళ్లు మూక ఉమ్మడి ప్రచారం మొదలు పెట్టారు.

ఇట్లా కలకాలం నుండి ఆర్జించిన కీర్తి ప్రతిష్ఠలు నశించి పోవడం తనకే మాత్రం ఇష్టం లేక కాశాస్త్రి తన దృష్టిని తీపికల్లంగళ్ల పైకి మరల్చి చల్ల కదలకుండా కూచున్నాడు

వాటిపేరు తీసికల్లంగళ్లైనా అవి అసలు కల్లు పాకలకు ఎందులోనూ తీసిపోవు ముద్రలులేని ఈతచెట్ల శిఖల్లో తాటికాయల్లా ముంతలు వ్రేలాడుతుంటే ప్రొద్దు పొయ్యేలోగా ఆ వూటకంటే వేయిరెట్లు వయ్యాపైనలు కన్పిస్తున్నాయి.

ఈ నాడు కాశాస్త్రిగారికి తీరికే లేదు. పాపం అర్జీల కోసంగానీ పిటిషన్ల కోసంగానీ జనాలతని దగ్గరికి వెళ్లడమే మానేశారు. అతడూ అంతే. అవసరమైతే ఏ ఆఫీసర్నయినా ఇంటికి పిలిచి మాట్లాడుకొంటాడు. అంత ముఖ్యమైన పనైతే అధ్యక్షుడు సుందరయ్య అంచెల మీద వెళి వస్తాడు.

మూడు పుష్పక విమానాలు తిరుగుతూ ఉన్నాయి.

నూరు నీరా అంగళ్లు జరుగుతూ ఉన్నాయి.

కనుసన్నల్లో కావలసినంత సిబ్బంది ఉండగా కాశాస్త్రి సామాన్య జనం కంటికి దూరం కావడంలో ఆశ్చర్యంలేదు. –

ఐనా జనాలు మాత్రం అతని దర్శనార్థం రోజా బాబులకి విలువిస్తారు. హైస్కూల్లో సీటు కావాలన్నా, ఆస్పత్రిలో చోటు కావాలన్నా అడవిలో ఆకు చిటే కావాలన్నా సంతలో ఏలం పాట పాడాలన్నా, కాశాస్త్రి సిఫార్సు ఉండక తప్పదు. అసలా మాటకు వస్తే కాశాస్త్రికి తెలియకుండా బుంగల గుంట ప్రాంతం చీమ చొరబడ్డానికైనా వీల్లేదు.

కాశాస్త్రి కఠినుడనీ — నిర్దయుడనీ — మహా కుట్ర దారుడనీ—, తేనె పూసిన కత్తి అనీ, గోముఖ వ్యాఘ్రంవలె అటు ఉద్యోగులనూ, ఇటు ప్రభుత్వాన్ని వంచించి—, ప్రజల్ని మోసగించి లక్షలాది పైకాన్ని ఆర్జిస్తున్నాడనీ గిట్టని వాళ్లంటారు.

కానీ చిలకల పాలెంలో—, చింతకాయల పెంటలో—, ఎలుంగొడ్ల పల్లెలో ఎక్కడ విన్నా జనాలు ఏకగ్రీవంగా "అతడు మొనగాడు. అతడా పులిగదా.., అబ్బో కాశాస్త్రి ఎంత కరుణా మయుడనుకొన్నారు....

ఘటికుడు. ఘటికుడు అతడే లేకుంటే ఈ బస్సులిట్లా నడుస్తాయా ? ఈ రోడ్లిట్లా వేస్తారా ? ఎక్కడంటే అక్కడ ఎప్పుడంటే అప్పుడు కావలసినన్ని సారాబుడ్లు దొరుకుతాయా ? ఆ మాటకు వస్తే ఈ కల్లంగళ్లు కాదు కాదు నీరా అంగళ్లు జరిగేవేనా?" అని స్తుతిస్తూ ఉంటారు. సందేహంలేదు వచ్చే ఎన్నికల్లో వద్దన్నా, కాశాస్త్రిని పిలిచి పిలిచీ ఓట్లేస్తారు జనాలు. రత్నాన్ని నిలుపుతారని ఆ టాంటాం పత్రికేదో అరాచకాలూ దురాచారాలూ ప్రాసింది గాని అసలు కాశాస్త్రి స్వయంగా ఎన్నికల్లో నిలబడుతాడు. అందుకే ఆయన డబ్బును అమితంగా ఆర్జించేస్తున్నారు.

ఎన్నికల్లో గెలవాలంటే నోటిమాటలా. మొదటి ఎన్నికల్లో పాతిక వేలైతే—, రెండో సారి యాభై వేలు. మూడోసారి లక్ష. మళ్లీ నాలుగోసారి రెండు లక్షలు. ఇట్లా వోట్ల ఖరీదు ఓట్ను పెరిగిపోతుంటే కాశాస్త్రి వూరుకొంటే ఎట్లా ?

ప్రజాసేవలో ఎన్నో తంటాలు పడితేగా ప్రజానాయకుడయ్యేది—, ఆ యోగమే కాశాస్త్రికి పడితే బుంగల గుంట సాక్షాత్తు బంగారు గుంటై పోదూ !

అదే నా ఆశయమంటాడు కాశాస్త్రి పార్టీ చాటున ఏ రాజకీయ వాదైనా కన్పిస్తే.

ఇంత గొప్పవాడైనా కాశాస్త్రి స్థానిక పత్రికా విలేఖరులకు మాత్రం ప్రత్యేకమైన మర్యాద ఇస్తాడు. కాఫీ సిగరెట్ల నుండి కార్లలో యాత్రల వరకూ వారికి మాత్రం స్పెషల్ మార్జిన్ !

అందుకోసమేగా వారు గూడా "నిజంగా కరుణా మయుడు కాశాస్త్రి" అని అనడం. శంఖులో పోస్తే తీర్థమైనట్లు కవులు గాయకులే అలా అంటే ఇక సామాన్య జనాల దృష్టిలో అతడు సాక్షాత్తు ప్రజా సేవకుడే, కాదనగలవారెవరు ? ★